ప్రతీఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ ఎ.సూర్యకుమారి కంట్రోల్ రూమ్ నుంచి ఏర్పాట్లు పర్యవేక్షణ

విశాలాంధ్ర-విజయనగరం : గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ఎంఎల్‌సి ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. సోమవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 4 గంటలు వరకు ఎన్నిక జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ సూర్యకుమారి ఆదివారం సందర్శించారు. అనంతరం కలెక్టరేట్ కంట్రోలు రూము నుంచి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షించారు. విజయనగరంతోపాటు చీపురుపల్లి, బొబ్బిలి డివిజన్ కేంద్రాల్లో కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలవద్ద పోలింగ్ సిబ్బందికి, ఎన్నికల సామగ్రిని, బ్యాలెట్ బాక్సులను బ్యాలెట్ పత్రాలను అందజేశారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి తీసుకొని తరలివెళ్లారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేకంగా 15 ఆర్టిసి బస్సులను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌నుంచి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

గ్రాడ్యుయేట్ ఓటర్లంతా తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. జిల్లాలో 58,502 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కు ఏర్పాట్లు పూర్తి అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఎక్కువ పోలింగ్ బూత్ లు ఉన్న కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఓటర్లు తమకిచ్చిన స్లిప్పుతో పాటుగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని తప్పనిసరిగా తీసుకొని రావాలని సూచించారు. సోమవారం జరగనున్న ఎం.ఎల్.సి ఎన్నికల్లో ఓటింగ్ విధానం సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా ఉంటుందని, బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేరుకు ఎదురుగా ఉన్న బాక్సులో, ప్రాధా న్యత నంబర్లను వేయాల్సి ఉంటుందని చెప్పారు. బ్యాలెట్ పేపర్ పై ఎటువంటి గుర్తులూ ఉండవని, అభ్యర్థుల పేర్లు, ఫొటోలు మాత్రమే ఉంటాయని తెలిపారు. అభ్యర్థుల పేరుకు ఎదురుగా అంకెల తోనే ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌లో ఇచ్చే పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మొత్తం 37 మంది అభ్యర్థులకు, ప్రాధాన్యతా క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయవచ్చునని సూచించారు. తమకు నచ్చిన ఎవరో ఒక అభ్యర్థికి తప్పనిసరిగా 1వ నెంబరు వేయాల్సి ఉంటుందని, 1వ ప్రాధాన్యత ఇచ్చిన ఓటు మాత్రమే చెల్లుబాటు అవుతుందన్నారు. ఎవరికైనా 1వ ప్రాధాన్యతా ఓటు వేసిన తరువాత ఇష్టం లేకపోతే, మిగిలిన అభ్యర్థులకు ఓటువేయకుండా వదిలేయవచ్చునని సూచించారు. పోలింగ్ సిబ్బంది చూపించే విధంగా బ్యాలెట్ పేపర్‌ను మడతపెట్టి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుందన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు క్యూలైన్లవద్ద నమూ నా బ్యాలెట్ పేపర్లను ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఓటర్లు పోలింగ్ బూత్ లోకి వెళ్లేముందే, తమ ఓటును ఎవరికి వేయాలో నిర్ణయించుకోవాలని, దీనివల్ల ఓటింగ్ ప్రక్రియ త్వరగా జరుగుతుందని సూచించారు. ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు నిరంతరాయంగా, ఓటింగ్ జరుగుతుందని, వీలైనంత వరకు ఓటర్లు ఉదయమే వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటు వేయక ముందుగానీ, వేసిన తరువాత గానీ, ఏ అభ్యర్థికి ఓటు వేస్తున్నదీ లేదా ఓటువేసిన విషయాన్ని బయటకు వెల్లడించకూడదని స్పష్టం చేశారు. ఫిర్యాదులుంటే 8333813468 వాట్సాప్ నెంబరుకు పంపించాలని కలెక్టర్ సూచించారు.

సీతం ఇంజనీరింగ్ కళాశాలలో పానిపూరీ మేళా

విశాలాంధ్ర-విజయ నగరంటౌన్ : గాజుల రేగ పరిధిలో వున్న సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఒక ప్రత్యేక కార్యక్రమం పానిపూరీ మేళా నిర్వహించడమైనది. ఈ సందర్భంగా 250 మంది సీతం ఇంజనీరింగ్ మరియు సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విద్యార్థినులు ఎంతో ఆనందంగా పాల్గొన్నారు. నేటితరాల వారికి పానిపూరి ఎంతో ప్రీతి పాత్రమైన తిను బండారం, మంచి పోషక విలువలు కలిగిన భారతీయ వంటకం అని విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి వినూత్న కార్యక్రమం అయిన పానిపూరి మేళ ఎంతగానో దోహద పడిందని సత్య కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశిభూషణరావు అన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమం చేపట్టిన సీతం ఇన్స్టిట్యూషనల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కి ఆయన ప్రశంసలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ రకాల పానీపూరీలను (దహిపూరి, జీర,తీక, పుదీనా,మసాలా పూరీ) ఏర్పాటు చేశార.ఈ పోటీలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలిచిన వారికి ప్రశంసా పత్రాలు వివిధ రకాల బహుమతులను అందజేశారు. విద్యార్థినులు ఇటు వంటి సరికొత్త కార్యక్రమంను మేము మొట్ట మొదట సరిగా చూస్తున్నాం అంటూ ఈ కార్యక్రమం నిర్వహించిన సీతం మనేజ్మెంట్ కు కృతజ్ఞత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ కెప్టెన్ సత్యవేణి , సీతం కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షునిగా సూరిబాబు

విశాలాంధ్ర-కొత్తవలస: జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికల్లో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షునిగా జాతీయ క్రీడాకారులు, పోర్ట్ వాలీబాల్ కోచ్ గవర సూరిబాబు ఎంపికైనట్లు జాతీయ రిఫరీ ఎల్.జి.ఎస్. కుమార్ తెలిపారు. సహాయ కార్య దర్శిగ దెందేరు పాఠశాల వ్యాయామ సంచాలకు లు, కె.కృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగ జాతీయ రిఫరీ కుమార్, కార్యవర్గ సభ్యునిగా పాత్తేటి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికైన ట్లు తెలిపారు. వీరిని మండల గేమ్స్, స్పోర్ట్స్ సభ్యులు అభినందించారు.

వైసీపీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజలకు చేరువచేయాలి

పార్టీ శ్రేణులు కృషిచేయాలని ఉపసభాపతి కోలగట్ల పిలుపు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజలకు చేరువయ్యే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో జరిగిన ఆవిర్భావ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జోహార్ వైయస్ఆర్, జగన్మోహన్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పార్టీ నాయకులు, కార్యకర్తల నినాదాలు మధ్య ఆ ప్రాంతమంతా మారు మోగింది. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 12 వసంతాలు పూర్తయిన సందర్భంగా పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి, అధికారాన్ని కైవసం చేసుకుని ప్రజాభీష్టంగా పాలన సాగుతోందని అన్నారు. కేవలం ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే తో ఆవిర్భవించిన పార్టీ అనతి కాలంలోనే ప్రజాభిమానాన్ని చూర గొని, 22 మంది పార్లమెంటు సభ్యులు, 151 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకొని రాష్ట్రంలోనే చరిత్ర సృష్టించిందని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా సచివాలయ వ్యవస్థను తెచ్చి, నవరత్నాలను అమలు చేస్తూ , సంక్షేమ అభివృద్ధి పాలనను ప్రజలకు అందిస్తోందని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏడాది కాలంలో చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలను క్యాలెండర్ రూపంలో ప్రకటిస్తూ అమలు చేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ కార్యకర్తల కష్టసుఖాలలో పాలు పంచుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని తద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండడం వల్లనే పదవులు పొందామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పార్టీ శ్రేణులకు చెప్పారు. ప్రజలకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అండగా నిలుస్తాయని మరోసారి భరోసా ఇచ్చారు. మాట తప్పని, మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరు తెచ్చుకున్నారని అన్నారు. నగర పార్టీ అధ్యక్షులు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన ఆవిర్భావ వేడుకలలో మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, మండలం ప్రజా పరిషత్ అధ్యక్షులు మామిడి అప్పలనాయుడు, నగర మేయర్ శ్రీమతి వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతి దేవి, పార్టీ జోనల్ ఇంచార్జ్ లు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఆయా విభాగాల నాయకులు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ అయ్యప్పస్వామి ఆలయానికి భారీ విరాళం

విశాలాంధ్ర -చీపురుపల్లి: చీపురుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణ నిమిత్తం ఆదివారం భార్గాల అప్పలనాయుడు కుటుంబ సభ్యులు 100116 అక్షరాలా లక్ష నూటపదహారు విరాళంగా ఇచ్చారు ఈ మొత్తాన్ని ట్రస్ట్‌బోర్డు సభ్యులు జి.విష్ణు అప్పికొండ అధిబాబు, ఎస్‌విజి శ్రీనివాసరావు, డి.రవి దిలీప్ కుమార్ ధనుక కు అందించారు.

చెత్తకుప్ప నుండి రెండు షాపులకు వ్యాపించిన మంటలు

అగ్నిప్రమాదంలో రూ.50వేల ఆస్తినష్టం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలోని షిర్డీసాయి ఆలయ సమీపంలో (విశాఖ వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కుళ్లు కోనేరు వద్ద) ఎవరో గుర్తు తెలియని వ్యక్తి అజాగ్రత్తగా కాల్చి పడేసిన సిగరెట్ వలన చెత్తకుప్పకు మంటలు అంటుకుని భారీగా చెలరేగటంతో పక్కన ఉన్న ఫ్రిడ్జ్ రిపేరు షాపు, టైర్లు, ఇంజిన్ ఆయిల్, ద్విచక్ర వాహనాల విడిభాగాలు అమ్మే షాపులకు ఆదివారం ఉదయం అగ్నికీలలు వ్యాపించాయి. చెత్తల నుంచి చెలరేగిన మంటలు రిపేర్ల కోసం ఉన్న ఫ్రిడ్జ్ లకు, పక్కన ఉన్న ఇంజిన్ ఆయిల్ షాపులకు అంటుకుని నల్లని పొగ కమ్ముకోవటంతో పాటు అగ్నికీలలు ఎగసి పడటంతో సమీపాన ఉన్న కిరాణా, మెడికల్, సెల్ రిపేరు వంటి ఇతర షాపుల వారు భయాందోళనకు గురయ్యారు. కాగా స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం ఫైర్ ఆఫీసర్ షేక్ మదీనా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రమాదంలో రూ.50వేల ఆస్తినష్టం సంభవించిందని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తి అజాగ్రత్తగా పొగ త్రాగి చెత్తకుప్పలో పడవేసిన కారణంగా మంటలు పక్కనే ఉన్న షాపులకు వ్యాపించాయని స్పష్టం చేశారు. వేసవికాలంలో ఇలాంటి అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ మదీనా హెచ్చరించారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కొత్తవలస: వైసీపీ 13వ, ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైసీపీ పార్టీ 12సంవత్సరాలు పూర్తి చేసుకొని 13వ, సంవత్సరంలో అడుగిడిన సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నర సంవత్సరకాలంలో ఎన్నో ఒడు దుడుకులు ఎదుర్కొని నిరాటంకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ద్వారా ప్రజారంజక పాలన అందిస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడిన ప్రజా ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పుల వెలమ సంఘ సంక్షేమ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, నీలంశెట్టి గోపమ్మ, కర్రి శ్రీను, గొరపల్లి శివ, విరోతి కొండల రావు, గ్రామ సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆటుపోట్లు ఎదుర్కొని లక్ష్యసాధన : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: జగన్మోహన్ రెడ్డి పార్టీని స్థాపించి ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోట్లు ఎదుర్కొని లక్ష్యాన్ని సాధించారని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. నెల్లిమర్ల మండలం లోని మొయిద గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేక్ ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావించి నేటికి 12 ఏళ్లు పూర్తయ్యాయని చెప్పారు. వైసిపితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి అట్టాడ కృష్ణ, నాయకులు దవళ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

దివంగత మహానేత డా. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కి ఘన నివాళులు

విశాలాంధ్ర-బొబ్బిలి: ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 12వసంతాలు పూర్తి చేసుకొని నేడు 13వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా పట్టణంలో గల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వైస్సార్ కాంగ్రేస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వైస్సార్ కాంగ్రేస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం డా.వై.యస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలుకు వైస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.వైస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన 4 సంవత్సరాల కాలవ్యవధిలో మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేసి దేశంలో అత్యుత్తమ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి నిలిచారాని కొని యాడారు.సుదీర్ఘ పాదయాత్ర చేసిన సీఎం జగన్ తండ్రిబాటలో నడుస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా సుదీర్ఘ పాదయాత్ర చేసి, ప్రజలలో మమేకం అయిన సీఎం జగన్మోహన్ రెడ్డి 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ 151 ఎమ్మెల్యే సీట్లు, 22 ఎంపీ సీట్లను గెలుచుకుని ప్రభంజనం సృష్టించారు అని తెలియజేశారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకై వైసీపీ ఆవిర్భావం

దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం పలు సంఘటనల నేపథ్యంలో ఆయన ఆశయాల సాధనే ధ్యేయంగా మార్చి 12, 2011న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థాపించారని పేర్కొన్నారు. 2011 మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో 18 అసెంబ్లీ స్థానాలకుగాను 15 చోట్ల, రెండు లోక్ సభ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది.అప్పటి నుండి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీని ముందుకు నడిపించిన వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఎట్టకేలకు అధికారం చేపట్టి జనరంజక పాలనసాగిస్తున్నారని అని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వేణుగోపాలనాయుడు, ఎంపీపీ ప్రతినిది శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గోళగాని రమాదేవి,చిలికాని మురళీకృష్ణ,బుడా ప్రతినిది ఇంటి గోపాలరావు ,తూముల భాస్కరరావు,ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు,జేసిఎస్ కన్వీనర్లు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియమాలు తప్పక పాటించాలి

విశాలాంధ్ర-సీతానగరం: నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ ఎన్వీ రమణ, ఎంపిడిఓ కృష్ణ మహేష్ రెడ్డి, ఎస్‌ఐ నీల కంఠంలు తెలిపారు. మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి రూంలో పోలింగు కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బంది ఉండేందుకు అన్ని ఏర్పాట్లు కూడా చేశామని తెలిపారు. ఇప్పటికే ఓటర్లకు ఓటు స్లిప్పులు పంపిణి చేశామన్నారు. స్థానిక హనుమాన్ కూడలి వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్టు కూడా ఏర్పాటు చేసి తనిఖీల ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో సాయంత్రం నుండి మద్యం షాపులు మూసినట్లు చెప్పారు. 144సెక్షన్ ఉత్తర్వుల కూడా జారీ చేసినట్లు చెప్పారు. నేటినుంచి రేపటి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటు నమోదు గూర్చి సూచిక ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్పి సూచనలు మేరకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఓటర్లు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్, ఎస్పీలు

విశాలాంధ్ర-పార్వతీపురం: పట్టభద్రుల ఎన్నికలను సజావుగా, పకడ్బందిగా నిర్వహణకు అన్నిచర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ నిషాంత్ కుమార్, జిల్లా ఎస్పి విద్యాసాగర్ నాయుడులు తెలిపారు.ఎన్నికల నిర్వహణప్రణాళిక, ఎన్నికలఅనంతరం బ్యాలెట్ బాక్సులు విశాఖపట్నంలోని స్ట్రాంగ్ రూంకు తరలించేందుకు చర్యలను తీసుకున్నట్లు చెప్పారు. వెబ్‌కాస్టింగ్ లేని పోలింగ్ కేంద్రాలవద్ద వీడియో గ్రాఫర్ ను ఏర్పాటుచేసామని చెప్పారు . ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలపై వారు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ కుమార్ మాట్లాడుతూ పార్వతీపురంలో తాత్కాలిక స్ట్రాంగ్ రూంను ఏర్పాటుచేశామని, పోలింగ్ బాక్సులను విశాఖ పట్నం తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. పోలింగ్ సజావుగా నిర్వహిం చేందుకు మండలస్థాయి ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ సూపరిండెంట్‌తో సంయుక్తంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయడమైనదని తెలి పారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే పట్టభద్రులు పోస్టల్ బ్యాలెట్ లో ఓటు హక్కు వినియోగించుకొనెలా సౌకర్యం కల్పించాలని సూచించారు. జిల్లాపోలీస్ సూపరిండెంట్ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ జిల్లాలో 8సున్నితమైన పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు రూట్, మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటుచేసినట్లు ప్రలోభాలకు గురై వాహనాల్లో గ్రూపులుగా ప్రయాణించి ప్రమా దాలకు గురయ్యే అవకాశం ఉన్నందున అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటువేసేందుకు రాలేని పరిస్థితిలో ఉన్న ప్రాంతాలకు వాహన సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. పటిష్టమైన భద్రతకు తాసిల్దారులు, సబ్ ఇన్స్పెక్టర్లు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు జరిగిందన్నారు. మండల పరిధిలోని బూత్ స్థాయి అధికారులతో పట్టభద్రుల ఓటరు జాబితా ప్రకారం అర్హులైన ఓటర్లకు ఇన్ఫర్మేషన్ స్లిప్ లను పంపిణీ చేసామని వెల్లడించారు. ఓటరు స్లిప్ ల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఈనెల 13న ఉదయం8గంటలనుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నట్లు చెప్పారు. పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్న ఓటర్లకు చివరిఓటరు వరకు స్లిప్ లు జారీచేసి అనుమ తించాలని ఆదేశాలు ఇస్తామని చెప్పారు. ప్రతీ పోలింగ్ కేంద్రం బయట ఓటు హక్కు వినియోగించుకునే విధానంలో ఓటు ఎలా వేయాలి, ఏమి చేయకూడదు అనే విషయాలను అవగాహన ఫ్లెక్సీలు ఏర్పాటుచేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహిం చేందుకు మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించామని చెప్పారు. సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ ఎనిమిది సున్నితమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పటిష్ట బందోబస్తును ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ కఠినంగా అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. బల్క్ గా మద్యం అమ్మకాలు జరగకుండా, బెల్ట్ షాపులు నిర్వహణ లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నుండి 100 మీటర్ల ముందు వాహనాల నిలుపుదల చేసేలా ఆ ప్రాంతంలో సూచనలు, నిబంధనలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేటి ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోనే పోలింగు సామాగ్రిని అందజేసేందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎక్కడా ఏటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

గురుకులాల్ని పరిశీలించిన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రమణమూర్తి

విశాలాంధ్ర-సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గల గురుకుల కళాశాలలను, పాఠశాలలను గిరిజన, గురుకుల రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రమణమూర్తి పరిశీలించారు. గురుకులాల్లో విద్యాబోధన విద్యార్థులకు సులభతరంగా అందించాలని ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి మెనూ సక్రమంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు, రికార్డ్స్ పరిశీలించారు. అదేవిధంగా గురుకులాల ఔట్సోర్సింగ్ సిబ్బంది రెగ్యులర్ చేయాలని వినతి పత్రాన్ని రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కి అందించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి సూర్యకుమారి, విశ్వనాథం, తిరుపతి రాజు, డి అరుణ జ్యోతి, ఏకలవ్య పాఠశాల ఇంచార్జ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియమాలు తప్పనిసరిగా పాటించాలి

మండల అధికారులు

విశాలాంధ్ర-సీతానగరం: నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ ఎన్వీ రమణ, ఎంపిడిఓ కృష్ణ మహేష్ రెడ్డి , ఎస్ ఐ నీలకంఠంలు తెలిపారు. మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి రూంలో పోలింగు కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బంది ఉండేందుకు అన్ని ఏర్పాట్లు కూడా చేశామని తెలిపారు.ఇప్పటికే ఓటర్లకు ఓటు స్లిప్పులు పంపిణి చేశామన్నారు. స్థానిక హనుమాన్ కూడలి వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్టు కూడా ఏర్పాటుచేసి తనిఖీల ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు.మండలంలో మద్యం షాపులను కూడా మూసినట్లు చెప్పారు.144సెక్షన్ ఉత్తర్వుల కూడా జారీ చేసినట్లు చెప్పారు. నేటి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటు నమోదు గూర్చి సూచిక ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్పి సూచనలుమేరకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఓటర్లు, ప్రజలు సహకరించాలని కోరారు. ఓటు హక్కు వినియోగించేందుకు వచ్చే వారు క్యూ పాటించి సహకారాన్ని అందించాలని కోరారు. తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ తెలిపిన గుర్తింపు కార్డును తీసుకొని రావాలని కోరారు.

400 లీటర్ల నాటు సారా స్వాధీనం

ఇరువురిపై కేసు నమోదు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వి. విద్యాసాగర్ వారి ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ డా. ఓ. దిలీప్ కిరణ్ వారి పర్యవేక్షణలో పార్వతీపురం మునిసిపాలిటి పరధి లో బైపాస్ రోడ్డులో ఒక రెస్టారంట్ వెనుక రైల్వే ట్రాక్ సమీపంలో బురద నీటిలో, తుప్పల్లో నాటు సారా దాచారన్న సమాచారమ్ మేరకు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ ఎల్. ఉపేంద్ర ఆధ్వర్యంలో యస్ఐబి సిబ్బంది మరియు కూలీల సాయంతో విస్తృతంగా జల్లెడ పట్టి 400 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, విచారణ జరపగా పార్వతీపురం మున్సిపాలిటీ కొత్తవలసకు చెందిన వెలగడ. సాగర్ అను వ్యక్తి ఒడిషా రాష్ట్రానికి చెందిన ముత్యాలు అనే వ్యక్తి వద్ద కొని ఇక్కడ దాచినట్టు తెలపడమైంది. సదరు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేయడం జరిగింది. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఎల్. ఉపేంద్ర మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ లో నేడు గిరిజన స్పందన రద్దు

ఐటీడీఏ కార్యాలయం

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఏ లో ప్రతి సోమవారం నిర్వహించినటువంటి గిరిజన స్పందన కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల నందర్భంగా రద్దు చేయడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి నవ్య పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఆదివాసీ సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వడానికి ఐటిడిఏకు అర్జిదారులు ఎవరూ సోమవారం రావద్దని, అధికారులు అంతా ఎమ్మెల్సీ ఎలక్షన్ విధుల్లో ఉండటం వలన ఈ గిరిజన స్పందన కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

వైయస్ఆర్‌సీపీకి ఎప్పటికీ ఓటమి ఉండదు ...

ఎమ్మెల్యే అలజంగి జోగారావు జోస్యం

విశాలాంధ్ర-పార్వతిపురం టౌన్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికే ఓటమి ఉండదని ఎమ్మెల్యే అలజంగి జోగారావు జోస్యం చెప్పారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 12వసంతాలు పూర్తి చేసుకొని నేడు 13వ వసంతంలో అడుగు పెట్టిన సందర్భంగా పార్వతీపురం పట్టణంలో గల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు, అనంతరం డా.వై.యస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులతో పాటు కలిసి పార్టీ కేక్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా ఆవిర్భావ దినోత్సవం వేడుక నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలుకు వైస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వైస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన 4 సంవత్సరాల కాలవ్యవధిలో మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేసి దేశంలో అత్యుత్తమ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి గారు నిలిచారాని కొనియాడారు. తండ్రి బాటలో నడుస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా సుదీర్ఘ పాదయాత్ర చేసి, ప్రజలలో మమేకం అయిన సీఎం జగన్మోహన్ రెడ్డి 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైస్సార్ సీపీ 151 ఎమ్మెల్యే సీట్లు, 22 ఎంపీ సీట్లను గెలుచుకుని ప్రభంజనం సృష్టించారు అని తెలియజేశారు.దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం పలు సంఘటనల నేపథ్యంలో ఆయన ఆశయాల సాధనే ధ్యేయంగా మార్చి 12, 2011న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థాపించారని పేర్కొన్నారు.2011 మార్చి 12 వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో 18 అసెంబ్లీ స్థానాలకు గాను 15 చోట్ల, రెండు లోక్ సభ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. అప్పటి నుండి తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ పార్టీని ముందుకు నడిపించిన వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఎట్టకేలకు అధికారం చేపట్టి జనరంజక పాలన సాగిస్తున్నారని అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు శ్రీమతి శోభా హైమావతి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ గారు పార్టీ ని స్థాపించి ఎన్నో ఆటు పొట్లలను ఎదుర్కొని ప్రజా సంకల్ప యాత్ర సుదీర్ఘకాలంగా చేపట్టి ప్రజలకు పూర్తి హామీ ఇస్తూ అధికారం చేపట్టిన వెంటనే వాలంటీర్ వ్యవస్థ, సచివాలయం వ్యవస్థ ల ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పించి ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను చేరువ చేసి ప్రజారంజక పాలనను సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ గారి ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు అంతా మరింత శ్రమించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలుపుతూ అందరికీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ లు, మండలా పట్టణ పార్టీ అధ్యక్షుకు, స్టేట్ డైరెక్టర్లు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, జేసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును గెలిపించండి

వాడాడ రాము

విశాలాంధ్ర-పార్వతీపురం: మూడుజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీడీపీ తరపున పోటీచేస్తున్న డాక్టరు వేపాడ చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ నియోజక వర్గ సీనియర్ నాయకుడు వాడాడ రాము పిలుపునిచ్చారు.శనివారం చివరిరోజున టీడీపీనాయకులతో కలిపి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. పట్టభద్రుడైన ప్రతీఓటరు తమ అమూల్యమైన ఓటును ఆలోచనచేసి విజ్ఞుడైన చిరంజీవిరావుకు వేయాలని కోరారు. విద్యావంతుడైన చిరంజీవిరావును గెలిపిస్తే పట్టభద్రులు సమస్యలపట్ల అవగాహనఉన్నందున వారిసమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తారని చెప్పారు. వారందరికీ కరపత్రాలు అందజేసి మద్దతుపలకాలని కోరారు. ఆయనతో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపిటిఎఫ్ జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహణ

విశాలాంధ్ర-పార్వతీపురం: స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో జిల్లా అధ్యక్షులు ఆర్ యన్ దుర్గారావుఅధ్యక్షతన ఏపిటిఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ఎన్. బాలకృష్ణరావు ఆధ్వర్యంలో జిల్లా మరియు మండలాల నివేదికలు సమర్పణ చేసి సంఘం బలోపేతం చేసేందుకు తగు సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. భానుమూర్తి ఆధ్వర్యంలో నూతన జిల్లాలు ఏర్పడినసందర్భంలో ఏపిటిఎఫ్ సంఘం నిబంధనావళి సవరణలు ప్రతిపాదన మరియు చర్చజరిగింది. సవరణలులో కొన్నిమార్పులకు సర్వ సభ్యసమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రదానకార్యదర్శి భానుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేసి ఉపాధ్యాయులపై దాడులు ఆపాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయ మహిళా నాయకులు వి ప్రమీలారాణి, ఎన్ శశిరేఖ, డి.ధనలక్ష్మిలను జిల్లాశాఖ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, వివిధమండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరపలను సత్కరించిన డిప్యూటీ సీఎం బూడి

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కేజీపూడి మాజీ సర్పంచ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు, వైసీపీ సీనియర్ నాయకుడు మెరపల సత్యనారాయణను పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ మేరకు ఆయన అనకాపల్లి జిల్లా కే కోటపాడు పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఆదివారం మర్యాద పూర్వకంగా కలవగా మెరపల సత్యనారాయణకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి మాట్లాడుతూ పదవులు కన్నా పార్టీయే ముఖ్యమన్నారు. పొందిన పదవికి వన్నె తెస్తూ పార్టీ పురోభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికతో పాటు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులగెలుపు కోసం గట్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ డైరెక్టర్ చలుమూరి పద్మావతి, వైసీపీ నాయకులు నిరుజోగి శ్రీను, దేబార్కి అప్పారావు, ఎన్ వెంకటరావు, గుడివాడ జోగినాయుడు, నాగిరెడ్డి సింహాచలం, బొడ్డు మంగరాజు తదితరులు పాల్గొన్నారు..

ఘనంగా ఎయిమ్ ఫర్ సేవ 16వ వార్షికోత్సవ వేడుకలు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వామీజీ

విశాలాంధ్ర-సీతానగరం: మండలం లోని లచ్చయ్యపేట వద్ద ఉండే ఎయిమ్ ఫర్ సేవ 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అప్పట్లో శ్రీశ్రీశ్రీ స్వామి దయానంద సరస్వతిస్థాపించిన ఈసంస్థలో ముఖ్యఅతిథిగా గుడివాడ ప్రణవాశ్రమం పీఠాధిపతులు శ్రీ స్వామి స్థర్యానంద సరస్వతి స్వామిజీ పాల్గొని సందేశాన్ని అందించారు. దేశ వ్యాప్తంగా క్షేత్రాలయాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరించారు. ఇక్కడ జరుగుతున్న సేవాకార్యక్రమాలను ప్రశంసించారు. ఇక్కడ చదువుతున్న చిన్నారుల ప్రదర్శనలు తిలకించారు. వారికి యోగ్యత పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో

బొబ్బిలి క్లాస్-1 కాంట్రాక్టర్, బొబ్బిలి వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ప్రముఖ వైద్యులు ఎం.సత్యనారాయణ మూర్తి, తూముల కార్తీక్, ఎస్ సాయి రమేష్, కొత్తా రవికుమార్, కంటి వైద్యులు కె వి అప్పారావు, సాలా అశోక, గోనా ప్రసాద్,పుల్లెల శ్రీనివాస, టి. గౌరునాయుడు, పి.నాగమణి, రమాదేవి, నల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సమష్టిగా పరిష్కరించుకుందాం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: పద్మశాలిల సమస్యలను సమిష్టిగా పరిష్కరించు కుందామని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారాపు శ్రీనివాసరావు అన్నారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి థామస్ పేటలో సంఘం జిల్లా అధ్యక్షులు గిడుతూరు రాము అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పద్మశాలిలందరూ ఏకతాటిపైకి వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. పద్మశాలిలకు 18శాతం రిజర్వేషన్ ఉన్నా రాజకీయంగా, సామాజికంగా ఇంకా వెనకబడి ఉన్నారని చెప్పారు. జిల్లా అధ్యక్షులు గిడుతూరు రాము మాట్లాడుతూ ఇప్పటికైనా పద్మశాలిలు సంఘటితంగా మారి హక్కులను సాధించికోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పూసపాటిరేగ అధ్యక్షులు కె బలరాం, జిల్లా కోశాధికారి కె చిరంజీవి, విశ్రాంతి ఎంపీడీఓ కె గౌరి శంకర్, తిప్పాన అప్పలరాజు, నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

నెల్లిమర్ల నియోజకవర్గంలో 5527 మంది పట్టభద్ర ఓటర్లు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల నియోజకవర్గంలో 5527 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు తహశీల్దార్, సహాయ ఎన్నికల అధికారి రమణ రాజు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యధికంగా నెల్లిమర్ల నగరపంచాయతీ, మండలంలో 2185 మంది గ్రాడ్యుయేట్లు ఓట్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. నెల్లిమర్ల మండలం నగరపంచాయతీ ఓటర్లకు నెల్లిమర్ల బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకూ పోలింగ్ జరగనున్నట్లు చెప్పారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెర్లాం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో తెర్లాం గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో విద్యార్థులచే తెనాలి రామకృష్ణ కథలు, బాలమిత్ర కలు మరియు నీతి కథలు చదివించడం చెప్పడం జరిగింది. మరియు చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం అయింది. ఈ కార్యక్రమానికి 11 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని స్థానిక గ్రంథాలయ అధికారి సి. హెచ్ కృష్ణ మూర్తి తెలిపారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-వేపాడ : వేపాడ మండల కేంద్రంలోని వేపాడ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల పాట బద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంను కలెక్టర్ పరిశీలించారు . ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు సంబంధించి పలు సూచనలు సలహాలు అందజేశారు.

ఎన్నికలకు సర్వంసిద్ధం

- 24 పోలింగు కేంద్రాలకు బ్యాలట్ బాక్సులు, సిబ్బంది పంపిణి

- జిల్లాలో 18వేల 520 మంది ఓటర్లు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో నేడు జరగనున్న పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. దీంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా పూర్వ శ్రీకాకుళం జిల్లా పాలకొండ శాసన సభ నియోజక వర్గంలో జరుగుతుందని వివరించారు. పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అందులో 8 మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని చెప్పారు. 18వేల520 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారని చెప్పారు. 2017 నాటి పట్టభద్రుల ఓటర్లు కంటే రెండు వందలశాతం ఎక్కువగా ఓటర్లను నమోదు చేశామని జిల్లా కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఎన్నికలకు ఐదు సెక్టార్లుగా విభజించి, సెక్టార్ అధికారులను నియమించి మేజిస్ట్రీరియల్ అధికారాలను ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. పోలింగ్ ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందని వివరించారు. ఓటర్లకు సమాచారం నిమిత్తం ఓటరు రశీదులను పంపిణీ చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరం పరిధిలో వాహనాలను అనుమతించడం జరగదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అన్ని పార్టీలు, అందరు అభ్యర్థులు విధిగా పాటించాలని ఆయన సూచించారు. ఎన్నికల ఏజెంట్లకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి గుర్తింపు కార్డులు జారీ చేశారని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను సూక్ష్మ పరిశీలకులుగా నియమించామని, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేశామని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు అనుసంధానం చేయడం జరిగిందని ఆయన చెప్పారు. నాలుగు వందల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో బృందాలు పనిచేస్తాయని అన్నారు. మొబైల్ పార్టీలు ఏర్పాటుతో సహా నాలుగు స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు డి.ఎస్పి ఆధ్వర్యంలో ఉంటాయని, పోలీసు సూపరింటెండెంట్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు పనిచేస్తాయని ఆయన చెప్పారు. రిజర్వ్ సిబ్బంది అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఓటర్లు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కమీషన్ నియమ నిబంధనలు శత శాతం పాటించి ఎన్నికలు సజావుగా, సాఫీగా జరుగుటకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం జరిగే పోలింగ్ కు ఆదివారం ఎన్నికల సామాగ్రిని పోలింగ్ అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశామని ఆయన వివరించారు.

ఫొటో గుర్తింపు కార్డులు ఉండాలి

ఓటరు విధిగా ఫోటో గుర్తింపు కార్డును తీసుకువెళ్లి ఓటువేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఎన్నికల కమీషన్ సూచించిన ఏదైనా ఫొటో గుర్తింపుకార్డు విధిగా ఉండాలని స్పష్టం చేశారు. అంతకముందు జిల్లా కలెక్టర్ ఎన్నికల సామగ్రి పంపిణీ పర్యవేక్షణను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై సూచనలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, డి. ఎస్పీ సుభాష్, సెక్టారల్ అధికారులు, పోలింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం : వైసీపి 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ యువజన విభాగం (శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా) జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్పర్సన్ డాక్టర్ అవనాపు భావన ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అవనాపు విక్రమ్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడాలన్న లక్ష్యంతో ఏర్పడిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని, నేడు తన ఆకాంక్షలకు అనుగుణంగా తమ నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ.శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారి సుపరిపాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గారిని మరోసారి సీఎంను చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని , ముఖ్యంగా యువశక్తి అందుకు కట్టుబడి ఉందని విక్రమ్ చేసారు . సీఎం జగన్ నేతృత్వంలో తమ పార్టీ ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకుంటుందని ఉమ్మడి విజయనగరం జిల్లా డిసిఎంఎస్ చైర్పర్సన్ డాక్టర్ అవనాపు భావన ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు దేశానికే తలమానికంగా ఉన్నాయని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.కృష్ణం రాజు,వి.గురుమూర్తి, సంపత్ రాజు, ధింసింగ్, ముని లక్ష్మణరావు, ఏర్నింటి నర్సింగరావు, రాంబాబు, కాదర్, వంకర శ్యామ్, గౌతం, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రం వేపాడ వైయస్సార్సీపి పార్టీ కార్యాలయంలో వైసీపీ నాయకులు ఆదివారం పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన నాటి నుండి ఎన్నో అవమానాలు అవరోధాలు ఎదుర్కొన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన నాటి నుండి రాష్ట్ర అభివృద్ధికి పార్టీ ప్రతిష్టకు ఎన్నో విధాల కృషి చేశారన్నారు.జడ్పిటిసి ఎస్. అప్పారావు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందునే అందరికీ పదవులు దక్కాయని రాబోయే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గి బాబు మాట్లాడుతూ ముందుగా ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోగలిగితే భవిష్యత్తులో తిరిగి వైసిపి అధికారంలోకి రావడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ సంఘం

అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, పంచాయతీరాజ్ జోనల్ ఇంచార్జి మెరపల సత్యనారాయణ,నెడ్ క్యాప్ డైరెక్టర్ చలుమూరి పద్మావతి, ఎంపీపీ సత్యవంతుడు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెంటాడలో... ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మెంటాడ: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ వసంతం లోనికి ప్రవేశించిన సందర్భంగా మండలంలోని పిట్టాడా గ్రామంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.పి.పి.రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ వైసిపి కాంగ్రెస్ పార్టీ ఏ ఉద్దేశ్యంతో స్థాపించబడిందో అంతకంటే ఎక్కువగానే ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అనుభవించారని రాజన్న రాజ్యాన్ని పునర్ నిర్మించాలన్న జగనన్న ఆశయం నెరవేరిందని రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి జాతి మత కుల భేదం లేకుండా అందరికీ సమన్యాయం చేసిన ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని మరల ఈ ప్రభుత్వమే రావాలని ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎం.పి.పి సారిక ఈశ్వరరావు,వైస్ ఎం.పి.పి ప్రతినిధి పొట్టంగి అచ్చుతరావు,మండల సచివాలయం కన్వీనర్ కనిమెరక త్రినాథ,రత్నాకర్ నాయుడు, నియోజకవర్గ-మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మరియు పార్టీ నాయుకులు,సర్పంచ్లు,ఎం.పి.టి.సిలు, సోషల్ మీడియా ప్రతనిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్/బెలగాం : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 12వసంతాలు పూర్తి చేసుకొని 13వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా స్థానిక వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అలజంగి జోగారావు వైస్సార్ కాంగ్రేస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసి డా. వైయస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులతో పాటు కలసి కేక్ కట్ చేసి

అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే అల జంగి జోగారావు మాట్లాడుతూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలుకు వైస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వైస్సార్ సిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన 4 సంవత్సరాల కాలవ్యవధిలో మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేసి దేశంలో అత్యుత్తమ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి నిలిచారని కొనియాడారు. తండ్రి బాటలో నడుస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా సుదీర్ఘ పాదయాత్ర చేసి, ప్రజల లో మమేకం అయిన సిఎం జగన్మోహన్ రెడ్డి 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సిపి 151 ఎమ్మెల్యే సీట్లు, 22 ఎంపి సీట్లను గెలుచుకుని ప్రభంజనం సృష్టించారన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖ రరెడ్డి మరణానంతరం పలు సంఘటనల నేపథ్యంలో ఆయన ఆశయాల సాధనే ధ్యేయంగా మార్చి 12, 2011న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి స్థాపించారని పేర్కొన్నారు. 2011 మార్చి 12వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో 18 అసెంబ్లీ స్థానాలకు గాను 15 చోట్ల, రెండు లోక్ సభ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుందని అప్పటి నుండి తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ పార్టీని ముందుకు నడిపించిన జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఎట్టకేలకు అధికారం చేపట్టి జనరంజక పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీని స్థాపించి ఎన్నో ఆటు పొట్లలను ఎదుర్కొని ప్రజా సంకల్ప యాత్ర సుదీర్ఘకాలంగా చేపట్టి ప్రజలకు పూర్తి హామీ ఇస్తూ అధికారం చేపట్టిన వెంటనే వాలంటీర్ వ్యవస్థ, సచివాలయం వ్యవస్థల ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పించి ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను చేరువ చేసి ప్రజా రంజక పాలనను సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలంతా మరింత శ్రమించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలుపుతూ అందరికీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ లు, మండలా పట్టణ పార్టీ అధ్యక్షుకు, స్టేట్ డైరెక్టర్లు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, ఎఎంసి చైర్ పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, జెసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

72 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో 58,502 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర-విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది. కలెక్టర్ సూర్యకుమారి అవసరమైన సూచనలు చేస్తూ, ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైనచర్యలు తీసుకుంటున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. జిల్లాలో 58,502 మంది పట్టభద్ర ఓటర్లు వున్నారు.మొత్తం ఓటర్లలో 38,625 మంది పురుషులు, 19,868 మంది మహిళా ఓటర్లు, 9 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు వున్నారు. విజయనగరం డివిజన్‌లో అత్యధికంగా 33,643 ఓటర్లు వుండగా, చీపురుపల్లిలో 14,256 మంది, బొబ్బిలిలో 10,603 మంది ఓటర్లు వున్నారు. వీరికోసం జిల్లా యంత్రాంగం 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం సమీపంలో కూడా ఓటరు స్లిప్పులు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఓటరు స్లిప్పుతోపాటుగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని ఓటర్లు తీసుకురావాల్సి ఉంది. పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో అంకెల ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్ కంట్రోల్ రూము నుంచి

బాలెట్ బాక్సులు తీసుకువెకుతున్న సిబ్బంది

ఎన్నికల నిర్వహంణకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి పర్యవేక్షించారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పి దీపికా పాటిల్ పర్యవేక్షిస్తున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు వాట్సాప్ నెంబరు 8333813468ను ఏర్పాటు చేశారు. ఇక ఎన్నికలు సక్రమంగా, సజావుగా జరిగేలా తగిన పర్యవేక్షణ చేసే నిమిత్తం ఎన్నికల సంఘం 72 మంది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లుగా నియమించింది. వీరికి అదనంగా మరో 18 మంది రిజర్వు అబ్జర్వర్లను కూడా నియమించారు. పోలింగ్ తీరును గమనించి దీనిపై ఎన్నికల సంఘానికి వీరు నివేదికలు అందజేస్తారు.ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాకు 229 పెద్ద సైజు బ్యాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సరఫరా చేసింది. వీటికి అదనంగా మరో 100 రిజర్వు బ్యాలెట్ బాక్సులు కూడా సరఫరా చేశారు. ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

వైభవంగా శ్రీ వినాయకస్వామి తీర్థ మహోత్సవాలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలం, శివరామరాజుపేట గ్రామంలో శ్రీవినాయకస్వామి 24వ తీర్థ మహోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ముందుగా వేదమంత్రో చ్చారణల నడుమ శ్రీవినాయకస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ ఝాన్సి, గ్రామపెద్దలు కె.జగదీష్, కె. లోకాభిరామకోటి, కాపుగంటి వాసు తదితరులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. శ్రీవినాయకస్వామి తీర్థ మహోత్సవానికి మండలంలోని పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులని ఆకట్టుకున్నాయి. ఆకతాయిల నుండి ఇబ్బందులు ఎదురుకాకుండా ఎస్.ఐ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

10 పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

- విద్యార్థులను ఒత్తిడికి గురిచేయవద్దు

- జిల్లా కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర-విజయనగరం : ఏప్రిల్ లో జరగనున్న 10 వ తరగతి పరీక్షలలో జిల్లాలో శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశ గా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి తెలిపారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో. విద్యార్థుల మార్కులను బట్టి సబ్జెక్ట్ వారీగా విశ్లేసించుకొని ఫలితాలు మెరుగ్గా వచ్చేలా చూడాలని తెలిపారు. శుక్రవారం టీమ్ కాన్ఫరెన్స్ ద్వారా మోడల్ స్కూల్స్, కెజిబివి, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ తో మాట్లాడారు. ప్రీఫైనల్ పరీక్ష ల్లో సబ్జెక్ట్ వారీగా ఫెయిల్ అయిన వారు ఏ కారణంగా ఫెయిల్ అయ్యారని వివరణ అడిగారు. ఏ ఏ సబ్జెక్టు ల్లో వెనకబడి ఉన్నారో వారి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, అదనపు ప్రిపేరేషన్ తరగతులను నిర్వహించాలని అదేశించారు. ప్రాక్టీస్ సెషన్ పేరుతో పిల్లల పై అధిక వత్తిడి పెట్టవద్దని, వారి సమర్థతను బట్టి దగ్గరే వుండి వారిని చైతన్య పరచి, వారితో చదివించాలని స్పష్టం చేసారు. ఉన్నత చదువులు చదివే స్థోమత, సమర్థత లేని వారికి పాలిటెక్నిక్ కు అప్లై చేయించాలని అన్నారు. కెరీర్ గైడెన్స్ పై కూడా వారికి అవగాహన కలిగించాలన్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అవసరమగు కాస్ట్ సర్టిఫికెట్ల కోసం సచివాలయంలో ఇపుడే దరఖాస్తు చేయాలని, తదుపరి అడ్మిషన్స్ కు ఇబ్బంది లేకుండా ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో డి.ఈ.ఓ లింగేశ్వర రెడ్డి, జిల్లా సోషల్ వెల్ఫేర్ రేసిడెంటిల్ స్కూల్స్ కోర్డినేటర్ చంద్రావతి, కెజిబివి , మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మండిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వరుసగా గ్రామ దేవతల పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో పాటు ఒక్కసారిగా ఎండలు పెరిగిపోవడంతో నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటే పరిస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువులతో పాటు, కాయగూరలు, పళ్ళు, పువ్వుల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. ఇటీవల కాలంలో కందిపప్పు ధర గత వారంలో 80 నుండి 90 రూపాయలు ఉండగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో 110 రూపాయలు రకాలను బట్టి ధరలను పెంచి అమ్ముతున్నారు. పంచదార మంచి రకం ప్రస్తుతం 45 రూపాయల పలకగా గత వారం 40 రూపాయలు ఉండేది. ఇక మినగపప్పు విషయానికి వస్తే రకాలను బట్టి 110, 120, 130 రూపాయలుగా పెంచడంతో సామాన్యులంతా బెంబేలెత్తే పరిస్థితి ఏర్పడింది. ఇక ఎండు మిరపకాయల విషయానికి వస్తే ఏకం కన్నీళ్లు కార్చే పరిస్థితి ఏర్పడింది. మొదటి రకం ఎండు మిరపకాయలు గతంలో ఎన్నడూ లేని విధంగా 400 రూపాయలు పెరిగాయి అంటే రానున్న వేసవికాలంలో మామిడి పచ్చడి తినే పరిస్థితి లేదని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇడ్లీ నూక, రిఫండ్ ఆయిల్, తదితర నిత్యావసర వస్తువుల ధరలు పెళ్లిళ్ల పేరుతో రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక పళ్ళు విషయానికి వస్తే యాపిల్ పళ్ళు కేజీ ధర 200 నుండి 250 వరకు పలుకుతుండగా కమలా పళ్ళు ధరలు సుమారు 100 రూపాయల వరకు పలుకుతున్నాయి. ఇక కాయగూరల ధరల విషయానికి వస్తే ఎండలు పెళ్లిళ్ల సీజన్లో పేరుతో గతంలో ఎన్నడూ లేని విధంగా వాటి రేట్లను పెంచేశారు. బెండకాయ ఏకంగా 100 రూపాయల పై మాటే బహిరంగ మార్కెట్లో పలకడం విశేషం. ఇక వంకాయ 60, చిక్కుడుకాయలు 60, బీరకాయలు 80, మూలంకాడ 20కి రెండు, టమాట 30 వరకు అమ్ముతున్నారు. దీంతోపాటు అందరికీ ఎంతో ఇష్టమైన పువ్వులు రేట్లు కూడా అమాంతంగా పెరిగిపోతున్నాయి. ఇదే తరహా కొనసాగితే రానున్న కాలంలో తినడానికి కూడా అనేక ఇబ్బందులకు గురి అయ్యే పరిస్థితులు ఉన్నాయని పలువురు అంటున్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం: కలెక్టర్

విశాలాంధ్ర విజయనగరం/జామి: జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయని, సర్వం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఆమె ఆదివారం సాయంత్రం జామి, ఎల్.కోట, వేపాడ మండలాల్లో పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. క్యూలైన్లు, పోడియం, ఇతర ఓటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటింగ్ వేగంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రక్కప్రక్క పోలింగ్ బూత్‌లు ఉన్నచోట, ఓటర్లుకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. క్యూలైన్లకు ప్రక్కనే త్రాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఓటర్లకు తగిన అవగాహన కల్పించేందుకు క్యూలైన్ల వద్ద నమూనా బ్యాలెట్ పేపర్లను ప్రదర్శించాలని చెప్పారు. ఎండ తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, టెంట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు మినహా ఇతరులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దని ఆదేశించారు. కెమేరాలకు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారని, ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశారని చెప్పారు. ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 4 గంటలు వరకు పోలింగ్ జరుగుతుందని, అయినప్పటికీ ఆఖరి నిమిషం వరకు వేచిచూడకుండా, ఉదయమే వచ్చి ఓట్లు వేయాలని ఓటర్లను కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూము నుంచి, వెబ్ కాస్టింగ్ ద్వారా, పోలింగ్‌ను పర్యవేక్షించడం జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు జిల్లాలోని 72 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో ప్రశాతంగా ఎన్నికల నిర్వహణకు తగిన అన్ని రకాల చర్యలనూ తీసుకున్నామని, ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఏఎన్ఎంపై దౌర్జన్యం చేసిన పలువురిపై కేసు

విశాలాంధ్ర - వంగర: మండలంలో నీలయ్యవలస గ్రామంలో సచివాలయ ఏ ఎన్ ఎం ఈశ్వరమ్మను అదే గ్రామానికి చెందిన గొండేల కళ్యాణ్, లలిత, చంద్రరావు, చింతల్లి, సత్యవతి, పద్మ, వెంకటమ్మ మూడు కుటుంబాలకు చెందిన వారు తనను ఇష్టంవచ్చినట్టు కొట్టారని వంగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎన్ఎం ఈశ్వరమ్మ ఇంటి వద్ద చెత్త (తొక్కు)ను పలువురు వేసారని ఆమె తల్లి అన్నపూర్ణమ్మ అడగ్గా వారంతా నానా దుర్భాషలాడి దౌర్జన్యం చేశారని ఫిర్యాదులో తెలిపారు. తగాదా జరిగినప్పుడు జోక్యం చేసుకునేందుకు తన బావ సింహాద్రిఆచారి ప్రశ్నించగా ఆయన్ని కూడా వారు కొట్టారని అన్నారు. తమపై దౌర్జన్యం చేసి కొట్టిన వారిపై చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. 10 మంది పై కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ బి.లోకేశ్వరావు తెలియజేశారు.

బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ బూత్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని, పట్టభద్రుల ఓటర్లకు బదులు ఇతరులు దొంగ ఓటు వేసే అవకాశం ఉండరాదని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్ లు సూచించారు. ఎస్.కోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం బూత్ ఏజెంట్లు, పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్సీపీకి అభిమానులైన పట్టభద్రుల ఓటర్లు ఖచ్చితంగా ఓటు వినియోగించుకునేలా పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. ఇక ఇతర ప్రాంతాల్లో ఉన్న మన పట్టభద్రుల ఓటర్లను తప్పనిసరి గా ఓటింగుకు వచ్చేలా చూడాలని నాయకులకు సూచించారు. బూతు ఏజెంట్లు మీకు అందజేసిన జాబితాల్లో ఉన్న పట్టభద్రుల ఓటర్లలో ఓటు వేసేందుకు వచ్చిన వారి పేర్లు, వివరాలతో ఒకటికి రెండు సార్లు సరిపోల్చుకోవాలని గుర్తు చేశారు. ఇక పార్టీ నాయకులు ఎక్కడా చిన్నపాటి తప్పులకు ఆస్కారం లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షలో రాష్ట్ర ఫోక్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, నాయకులు పొలమరశెట్టి రామకృష్ణ, పార్వతి, మోపాడ కోటి, కామిరెడ్డి రంగా, జయశంకర్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గురుకులంలో కన్నవారి దీవెన

విశాలాంధ్ర - వేపాడ: మండల కేంద్రం వేపాడ శివారు బక్కునాయుడుపేటలోని అంబేద్కర్ గురుకులం పాఠశాలలో ఆదివారం కన్నవారి దీవెన కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు కన్నవారి దీవెన కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రుల పాదాలను కడిగి పాదనమస్కారం చేశారు. ఈ సందర్భంగా గురుకులం ప్రిన్సిపాల్ ఉషారాణి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు కన్నవారి దీవెన అనే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు స్కూలులో చేరేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినందున ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు పంపుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులందరికీ హాల్ టికెట్లను పంపిణీ చేశారు.

ఎన్నికల ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకమని, దీనిలో పాల్గొనే ఎన్నికల ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్, మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ ఇన్‌చార్జి బొబ్బిలి చిరంజీవులు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే టీడీపీ ఎన్నికల ఏజెంట్లకు పలు అంశాలపై సూచనలు చేశారు. డూప్లి కేటు ఓటర్లు, డమ్మీ ఓటర్లు తదితర అంశాలను ప్రస్తావించి ఓటింగు ప్రారంభం నుండి ముగింపు వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, టిడిపి పట్టణ మండల పార్టీ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహన్, సీతానగరం పార్టీ అధ్యక్షుడు కొల్లి తిరుపతిరావు, టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, గర్భాపు ఉదయభాను, తాతపూడి వెంకటరమణ, బడే గౌరునాయుడు, బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, చందక దేశాలు, మరిశర్ల కార్తీక్ నాయుడు, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ తృతీయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో వేంచేసిన శ్రీకృష్ణ స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. వార్షికోత్సవ మహోత్సవాన్ని పురస్కరించుకొని వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడంతోపాటు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు హూరాహోరుగా సాగాయి. ఈ పోటీలో సుమారు 10 ఎడ్ల బండ్లు పాల్గొనగా మొదటి స్థానంలో వావిలపాడు గ్రామానికి చెందిన యాదవ సంఘం బండి దక్కించుకోగా నిర్వాహకులు 12 వేల రూపాయలు నగదు బోను సింహాద్రి నాయుడు (బోనుబాబు) ఆర్థిక సహాయంతో 2వ బహుమతిని రోమాల వారి సహాయంతో యాదవ సంఘం అందజేశారు. మూడవ బహుమతి యాదవ యూత్ సంఘం అందించగా నాలుగవ బహుమతి అంబేద్కర్ యువజన సేవా సంఘం వావిలపాడు గ్రామానికి చెందిన వారి ఆర్థిక సహాయంతో, ఐదవ బహుమతి శ్రీ ఉమాగణపతి ఎంటర్ప్రైజెస్ దేవరాపల్లి వారి ఆర్థిక సహాయంతో, ఆరవ బహుమతి గ్రామానికి చెందిన పెంటపల్లి అప్పన్న ఆర్థిక సహాయంతో, 7వ బహుమతి గండి సింహాద్రి అప్పడం మనవలు అభి, సాయి ఆర్థిక సహాయంతో, 8వ బహుమతి పళ్ళ అచ్చన్న జ్ఞాపకార్థం వారి మనవడు వెంకటరావు ఆర్థిక సహాయంతో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోనుబాబు, గండి శ్రీరామ్మూర్తి, గుంటపల్లి నాయుడు, యాదవ సంఘం నాయకుడు శ్రీనివాసరావు, యాదవ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు స్లిప్‌తోపాటు గుర్తింపు కార్డును తప్పనిసరి

విశాలాంధ్ర - పార్వతీపురం: మన్యం జిల్లాలో నేడు జరుగనున్న శ్రీకాకుళం - విజయనగరం - విశాఖపట్టణం పట్టభద్రుల నియోజక వర్గ ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఎన్నికలు దృష్ట్యా జిల్లా పరిధిలో గల 24 పోలింగ్ కేంద్రముల ఓటర్లు గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని ప్రధాన ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు.

ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, భారతీయ పాస్ పోర్టు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం/ ప్రభుత్వ రంగ సంస్థలు/స్థానిక సంస్థలు/ప్రైవేట్ పారిశ్రామిక గృహాలు వారిచే జారీ చేయబడిన సేవా గుర్తింపు కార్డు, పార్లమెంట్ సభ్యులు/శాసన సభ్యులు/శాసన మండలి సభ్యులచే ప్రత్యేకంగా జారీ చేయబడిన గుర్తింపు కార్డు, విద్యాసంస్థలు సంబంధిత ఉపాధ్యాయులు/గ్రాడ్యుయేట్లకు జారీ చేసిన సేవా గుర్తింపు కార్డు, వివిధ విశ్వ కళా పరిషత్ లు జారీ చేసిన డిగ్రీ/డిప్లొమా ఒరిజినల్ ధృవ పత్రము సంబంధిత అధికారులచే జారీ చేయబడిన వికలాంగ ఒరిజినల్ ధృవీకరణ పత్రము సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారిచే జారీ చేసిన ప్రత్యేక దివ్యాంగులు గుర్తింపు కార్డులు చూపించి ఓటును వేసుకోవాలని కోరారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వైసీపీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ యువజన విభాగం (శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా) జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్పర్సన్ డాక్టర్ అవనాపు భావన ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు నిర్వహించారు. అవనాపు విక్రమ్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడాలన్న లక్ష్యంతో ఏర్పడిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని, నేడు తన ఆకాంక్షలకు అనుగుణంగా తమ నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి సుపరిపాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.కృష్ణం రాజు, వి.గురుమూర్తి, సంపత్ రాజు, భింసింగ్, ముని లక్ష్మణరావు, ఏర్నింటి నర్సింగరావు, రాంబాబు, కాదర్, వంకర శ్యామ్, గౌతం పాల్గొన్నారు.

గజపతినగరం: గజపతినగరం వైయస్సార్ పార్టీ కార్యాలయంలో ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి శాసనసభ్యులు అప్పల నరసయ్య పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆవరణలో పార్టీ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తి చేసుకొని 13వ ఏట అడుగు పెట్టామని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందతో పార్టీ బలోపేతానికి కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తవుడు, మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రావు, పార్టీ నాయకులు బెల్లాన త్రినాధరావు, కరణం ఆదినారాయణ, మండల సురేష్, బండపల్లి మండల అధ్యక్షులు చెల్లవ నాయుడు, కర్రి రాము నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - చీపురుపల్లి: ప్రతి ఒకరు యోగా నేర్చుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వుంటారని చైతన్య యోగా సెంటర్ వ్యవస్థాపకులు గవిడి సుజాత, విజయనగరం యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్య నిర్వహణా ధికారి రామగోపాల్ అన్నారు. ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కాలేజ్ ఆవరణలో బాలికల వసతి గృహం విద్యార్థులకు ఆశయ యూత్ అసోషియేషన్, విజయనగరం జిల్లా యువజన సర్వీసుల శాఖ (సెట్విజ్) వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేయాలని, యోగా ద్వారా మానసికంగా వుండడంతో పాటు మైండ్ పవర్ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ, హాస్టల్ వార్డెన్ యశోధ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కోటమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: జిల్లా ప్రజల ఇలవేల్పు, కొట్టాం గ్రామ దేవత కోటమ్మ అమ్మవారి తొలేళ్ల మహోత్సవం (పోతురాజు పండుగ) సోమవారం ప్రారంభం కానుంది. కోటమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలను పురస్కరించుకుని కొట్టాం గ్రామంలోని గద్దె గుడి వద్ద కొలువుదీరిన కోటమ్మతల్లిని పలు గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు ఆదివారం దర్శించుకుని పసుపు, కుంకుమలతో పాటు చీరలు, రవికెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కొట్టాం కోటమ్మ అమ్మవారి ఆలయ ఈఓ నాగేంద్ర విలేకరులతో మాట్లాడుతూ జాతర సందర్భంగా పలు చోట్ల చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసామని తెలిపారు. కాగా రెండు రోజుల పాటు జరగనున్న కోటమ్మవారి పండుగ మహోత్సవాలకు వైవీ రమణిని ప్రత్యేకాధికారిగా నియమించినట్లు ఆలయ ఈఓ నాగేంద్ర తెలియజేశారు.

గిరిజన ప్రాంతాల్లో విరగ్గాసిన 'పనస'

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని దారపర్తి గిరిజన పంచాయతీ పరిధిలోని పల్లపుదుంగాడ, రాయిపాలెం, సప్పన్నగెడ్డ, మనుపురాయి తదితర గ్రామాల్లో గల పనస చెట్లు విరగ్గాసాయి. పనస చెట్లకు కాండం నుంచి మీద కొమ్మల వరకు ఒక్కో చెట్టుకు సుమారు 50 కాయలకు పైగా కాపుకాసి అలరిస్తున్నాయి. కజ్జ, దేశవాళీ రకాలైన ఈ పనసకు విశాఖ, విజయనగరం మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందన్నారు. మార్కెట్ ధర ప్రకారం ఒక్కో పండుకు సుమారు రూ.500 నుండి రూ.700 వరకు ధర పలకవచ్చని అంటున్నారు. అయితే అప్పట్లో హుదూద్ తుఫాను గాలులకు పనస చెట్లు పెద్ద ఎత్తున నేలకొరగటంతో దారపర్తి పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల్లో పనస చెట్లు బాగా తగ్గిపోయాయని గిరిజనులు తెలిపారు.

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహాధ్యక్షునిగా మళ్ల

విశాలాంధ్ర - శృంగవరపుకోట: విజయనగరం సిటీ క్లబ్ ఆవరణలో ఆదివారం జరిగిన జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహాధ్యక్షునిగా ఎస్.కోటకు చెందిన రిటైర్డు ఫిజికల్ డైరెక్టర్, జాతీయ స్థాయి వాలీబాల్ మాజీ క్రీడాకారుడు మళ్ల రామకృష్ణను, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారుడిగా, కోచ్‌గా అనేకమంది క్రీడాకారులను తయారు చేశారని, జిల్లాలో వాలీబాల్ క్రీడాభివృద్ధికి సేవ చేసారని గుర్తు చేశారు. క్రీడాకారులు వాకాడ చినబాబు, రిటైర్డు ఫైర్మెన్ కర్రి జగదీష్, పొట్నూరు శ్రీరాములు, రేగలబంధ అప్పారావు, చిట్టిబాబు, జెర్రిపోతుల ఉమ, జెర్రిపోతుల నానాజీ, దేవి కమిటీ అధ్యక్షుడు కేవీఎస్ రామరాజు, ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు జె.మురళి, సభ్యుడు ఎస్.వి.సుధాకర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకర్స్ నడక మైదానంలో ఆదివారం సీనియర్ సభ్యులు నడుపూరు వెంకట రమణ పుట్టినరోజు సందర్భంగా పి.జి. స్టార్ హాస్పిటల్ సౌజన్యంతో బి.పి, షుగర్ పరీక్షా శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు(సి.హెచ్.రమణ) నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, ప్రతీ ఒక్కరూ ఎప్పటికప్పుడు బిపి, షుగర్ తనిఖీలు చేసుకొని, అవసరమైన వారు మందులు వేసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని అన్నారు. పి.జి. స్టార్ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ.కామేశ్వరరావు, లాబ్ టెక్నీషియన్ కాంత, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ అభిషేక్ సేవలందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోట్ల సత్యనారాయణ, కోశాధికారి జి.గోవిందరావు, ఉపాధ్యక్షుడు వై.నలమారాజు, వాకర్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్-102, మాజీ గవర్నర్లు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, యడ్ల గణేష్, డిప్యూటీ గవర్నర్ పతివాడ నారాయణరావు, క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎన్నికలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

విశాలాంధ్ర - తెర్లాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరుగుతున్నందున పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలక్కుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని తహశీల్దార్ ఏఈఆర్‌వో డోల రాజేశ్వరరావు తెలిపారు. ఈ పోలింగ్ స్టేషన్‌కు 788 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, అందులో 770 మందికి ఓటరు స్లిప్పులు సిబ్బందితో పంపిణీ చేయించడం జరిగిందని అన్నారు. మిగిలిన 18 మంది అందుబాటులో లేకపో వడంతో పంపిణీ చేయడం జరగడం లేదని అలాగే వారు కూడా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. అయితే ఓటరు ఓటు హక్కును ఎలా వేయాలి, ఎలా వేయకూడదు అనే సంకేతాన్ని బోర్డులో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. సోమవారం జరగబోయే ఎన్నికలకు ఒక ఎన్నికల పోలింగ్ ఆఫీసర్, ఇద్దరూ అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, ఒకరు అదనపు పోలింగ్ ఆఫీసర్, ఒకరు మైక్రో అబ్జర్వర్ ఉన్నారని, ఉదయము 8 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఏజెంట్లు ఎన్నికల నియమావళిని పాటించాలని ఆయన తెలిపారు.